# నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 297 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 23 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


# లఖ్‌నవూలో ఘోర అగ్నిప్రమాదం- 14 మంది మృతి!

## మరికొందరు అభ్యర్థులు భవనంలోపల చిక్కుకున్నారని భావిస్తున్న పోలీసులు



**లఖ్‌నవూ, జూన్ 22 (నమస్తే ఉదయం)**

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అలీగంజ్ ప్రాంతంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మొదట 8 మంది మృతి చెందగా, ఇప్పుడు ఆ సంఖ్య 14కు పెరిగింది. పలువురు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఇంకా కొందరు వ్యక్తులు లోపల చిక్కుకుపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. మంటలు నుంచి తప్పించుకునేందుకు భవనంలోపల ఉన్న విద్యార్థులు కిందకు దూకేసిన దృశ్యాలు స్థానికులను భయాందోళనలకు గురిచేశాయి. సహాయక చర్యలను యూపీ డిప్యూటీ సీఎం బ్రిజేశ్ పాఠక్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**ఇంతకీ ఏం జరిగింది?**

ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూ అలీగంజ్ ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మూడు అంతస్తుల వాణిజ్య భవనంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. మంటలు వేగంగా వ్యాపించి అదే భవనంలోని రెండో అంతస్తులో ఉన్న కోచింగ్ సెంటర్, గేమింగ్ జోన్, సాఫ్ట్‌వేర్ ఆఫీసులను చుట్టుముట్టాయి. మంటల్లో ...మిగతా 2లో



## రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో

# సీఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి భేటీ

**మెట్రో ఫేజ్-2 అనుమతులపై చర్చ**

**మూడు రోజుల దిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి**

**న్యూఢిల్లీ, జూన్ 22 (నమస్తే ఉదయం)**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్–2 అనుమతులపై వారు చర్చించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వే మంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో తాజా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట టేకోవర్, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, ఐఆర్ఎఫ్‌సీ పెండింగ్ నిధులు గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ జరుగుతోన్న వేళ ఈ భేటీకి ప్రాధ్యానత సంతరించుకుంది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇరువురు ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపించుకుంటున్నారు. కిషన్ రెడ్డి వల్లే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్ట ఆగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించగా.. తన వల్ల తెలంగాణకు రావాల్సిన ఏ ప్రాజెక్ట ఆగిపోలేదని కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అయితే, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట ఫేజ్ 2 అనుమతులు, పెండింగ్ నిధులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ అరేంజ్ చేయాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. సీఎం అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ సెట్ చేశారు. ఈ సమావేశంలో ఆయన కూడా పాల్గొన్నారు. ఉప్పు నిప్పులా ఉన్న ఇద్దరు నేతలు ఒకే గదిలో కూర్చొని చర్చించడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది.





## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌తో

# సీఎం రేవంత్ రెడ్డి భేటీ

**పలు అంశాలపై 20 నిమిషాలు చర్చ**

**మూడు రోజుల దిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి**

**ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్న రక్షణ మంత్రి**

**హైదరాబాద్, జూన్ 22(నమస్తే ఉదయం)**

దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. ఆయనతో దాదాపు 20 నిమిషాల పాటు పలు అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామని రక్షణ మంత్రి హామీ ఇచ్చారు. వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, హ్యాంగర్, ఎమ్ఆర్‌వో సౌకర్యాలు కల్పించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని ఆయన కోరారు.

## డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి..


**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో టిప్పర్ ఢీకొని డీటీఓ వెంకన్న దుర్మరణం**

**విచారణ జరపాలంటూ రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌కు రేవంత్ ఆదేశం**

**వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని సీఎం హామీ**



2




## వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు

# 100 సీట్లు పక్కా

**మహేశ్ కుమార్ గౌడ్**

**ఓట్ల దొంగతనంతో పాటు బీజేపీ సీట్ల దొంగతనానికీ పాల్పడుతోందని ఆరోపణ**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ**

**సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని వెల్లడి**

**వరంగల్, జూన్ 22(నమస్తే ఉదయం)**

తెలంగాణలో ఎప్పుడు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించినా కాంగ్రెస్ పార్టీ 100 స్థానాల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ...మిగతా 2లో

# నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు

## వచ్చే ఐదేళ్లు సినిమా చూపిస్తా: కేటీఆర్

**ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసిన కేటీఆర్**

**మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టేది లేదని స్పష్టీకరణ**

**సప్తసముద్రాలు దాటినా వెతికి పట్టుకొస్తానని శపథం**

**వచ్చే ఐదేళ్లు చిట్టి నాయుడుకి, ఆయన బృందానికి సినిమా చూపిస్తానన్న కేటీఆర్**

**వర్ధన్నపేట కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జూన్ 22(నమస్తే ఉదయం)**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తాను తన తండ్రి కేసీఆర్ అంత మంచివాడిని కాదని, తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని, మనపై కేసులు పెట్టినోడిని మర్చిపోం. అదే సమయంలో మనతో నిలబడిన వాళ్లను కూడా మర్చిపోం. నేను కేసీఆర్ సారంత మంచోడినైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు, ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది. పక్కా ...మిగతా 2లో



## నాంపల్లి కోర్టు సమన్లు... వర్చువల్‌గా

# విచారణకు హాజరైన అల్లుఅర్జున్

**షూటింగ్ వల్ల వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరిన బన్నీ**

**నేడు వర్చువల్‌గా విచారణకు హాజరు**



**హైదరాబాద్, జూన్ 22(నమస్తే ఉదయం)**

పుష్ప–2 సినిమా బెనిఫిట్ షో తొక్కిసలాట కేసుపై నాంపల్లి కోర్టులో వాదనలు జరిగాయి. ఈ కేసులో వ్యక్తిగతంగా హాజరు కావాలంటూ న్యాయస్థానం సమన్లు జారీ చేసినప్పటికీ సినీ నటుడు అల్లు అర్జున్ సినిమా షూటింగ్ షెడ్యూల్స్ కారణంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు హాజయ్యారు. తనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఇందుకు కోర్టు అనుమతించడంతో వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. అల్లుఅర్జున్ మినహా మిగతా నిందితులంతా వ్యక్తిగతంగా న్యాయమూర్తి ...మిగతా 2లో

# ఉద్ధవ్ వర్గానికి కోలుకోలేని దెబ్బ

**షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన రెబల్ ఎంపీలు**

**షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఉద్ధవ్ వర్గానికి చెందిన రెబల్ ఎంపీలు**



**ముంబై, జూన్ 22(నమస్తే ఉదయం)**

శివసేన–UBT అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు తిరుగుబాటు ఎంపీలు అధికారికంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలో శివసేనలో చేరారు. దక్షిణ ముంబయిలోని వై.బి.చవాన్ సెంటర్‌లో ఏకనాథ్ శిందే సమక్షంలో వీరు పార్టీ కండువా కప్పుకున్నారు. లోక్‌సభలో శివసేన UBTకి మొత్తం తొమ్మిది మంది ఎంపీలు ఉండగా, అందులో ఏకంగా ఆరుగురు పార్టీ మారారు. ఈ పరిణామంతో లోక్‌సభలో శిందే వర్గం శివసేన ఎంపీల బలం 7 నుంచి 13కి పెరిగింది. మూడింట రెండొంతుల మెజారిటీ ఎంపీలు శివసేన–UBTని వీడటంతో వీరిపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడే అవకాశం లేదు.

# డీటీవో వెంకన్న మృతిపై రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి.. విచారణకు ఆదేశం

**హైదరాబాద్, జూన్ 22(నమస్తే ఉదయం)**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విధి నిర్వహణలో ఉండగా బొగ్గు టిప్పర్ లారీ ఢీకొని జిల్లా రవాణా శాఖ అధికారి ఎం. వెంకన్న ఘోర మరణం చెందిన ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. డీటీఓ వెంకన్న మృతిపై సమగ్ర విచారణ జరపాలని రవాణాశాఖ జాయింట్ కమిషనర్‌ను సీఎం ఆదేశించారు. ఈ ఘటనపై వీలైనంత త్వరగా పూర్తి స్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రెస్ నోట్ విడుదల చేసింది. వెంకన్న మృతి పట్ల సంతాపం ప్రకటించిన సీఎం.. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన డీటీఓ వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామన్నారు. ప్రమాదం వివరాల్లోకి వెళితే... ఈ ఉదయం గణపురం మండలం చెల్పూరు శివారులో వాహనాలను తనిఖీలు చేస్తుండగా బొగ్గు లోడ్‌తో వెళుతున్న టిప్పర్ లారీ వెంకన్నపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు.

# నేను కేసీఆర్ అంత మంచోణ్ని కాదు

మొదటి పేజీ తరువాయి

విడిచిపెట్టను" అని అన్నారు. కార్యకర్తలను వేధించిన వారు ఎక్కడున్నా వదలబోమని కేటీఆర్ హెచ్చరించారు. "రిటైరైనా, పారిపోయినా, సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. మా కార్యకర్తలను సతాయించిన ఒక్కొక్కడినీ వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది. వదిలిపెట్టే సమస్యే లేదు. ఇది ఊరికే చెప్పడం లేదు, గుర్తు పెట్టుకోండి" అని ఆయన వ్యాఖ్యానించారు.

# నాంపల్లి కోర్టు సమన్లు వర్చువల్‌గా విచారణకు హాజరైన అల్లుఅర్జున్

మొదటి పేజీ తరువాయి

ఎదుట హాజరయ్యారు. 2024 డిసెంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో గల సంధ్య థియేటర్‌లో పుష్ప–2 సినిమా బెనిఫిట్ షో ప్రదర్శించారు. ఈ సందర్భంగా నటుడు అల్లు అర్జున్‌ను చూసేందుకు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. థియేటర్ వద్ద సరైన రక్షణ చర్యలు, ముందస్తు ఏర్పాట్లు లేకపోవడంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఈ దురదృష్టకర ఘటనలో రేవతి అనే మహిళ ఊపిరాడక ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన చిక్కడపల్లి పోలీసులు లోతుగా దర్యాప్తు జరిపారు. ఏ–11గా అల్లుఅర్జున్ : థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యాన్ని వేలెత్తి చూపుతూ సంధ్య థియేటర్ యాజమాన్య సభ్యులను ఏ–1 నుంచి ఏ–10 నిందితులుగా చేర్చారు. అలాగే శాంతిభద్రతల సమస్యకు కారణమయ్యారనే ఆరోపణలతో నటుడు అల్లు అర్జున్‌ను ఈ కేసులో ఏ–11 నిందితుడుగా పేర్కొంటూ పోలీసులు ఇప్పటికే 23 మందిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో ట్రయల్ ప్రారంభించడానికి ముందే నిందితులందరినీ వ్యక్తిగతంగా పరిశీలించాల్సి ఉండటంతో, నాంపల్లి కోర్టు అల్లుఅర్జున్‌తో సహా 19 మంది నిందితులకు వ్యక్తిగతంగా హాజరుకావాలని సమన్లు జారీ చేసింది. జులై 6న తదుపరి విచారణ : అయితే ముందస్తు షూటింగ్ ఒప్పందాల కారణంగా తాను రాలేకపోతున్నానని, హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని అల్లు అర్జున్ తరఫు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. ఆయన మినహా మిగిలిన నిందితులంతా ఈరోజు న్యాయస్థానం ముందు హాజరయ్యారు. అనంతరం ఇంచార్జ్ జడ్జి సమక్షంలో నిందితులంతా కమిటెడ్ బాండ్లపై సంతకాలు చేశారు. నిందితుల హాజరు ప్రక్రియ ముగియడంతో నాంపల్లి కోర్టు ఈ కేసు తదుపరి విచారణను జులై 6వ తేదీకి వాయిదా వేసింది.

# వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 100 సీట్లు పక్కా

మొదటి పేజీ తరువాయి

మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓట్ల దొంగతనంతో పాటు సీట్ల దొంగతనానికి కూడా బీజేపీ పాల్పడుతోందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకున్నారో ప్రజలు ఇంకా మర్చిపోలేదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రస్తుతం సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల్లా ముందుకు సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ యంత్రాంగాన్ని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే లక్ష్యంతో ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు.



# ప్రజావాణి ఆర్జీలను పరిష్కరించాలి

**ప్రజావాణికి మొత్తం 60 దరఖాస్తులు. .. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 22(నమస్తే ఉదయం):**

ప్రజావాణికి వచ్చిన ఆర్జీలను పెండింగ్ లో ఉంచకుండా సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా ఐడిఓసి సమావేశపు మందిరంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఈ వారం ప్రజావాణికి మొత్తం 60 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల స్థాయిలోనే వివిధ ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిష్కరిస్తే, ప్రజలు చిన్న చిన్న సమస్యలకు ఇక్కడి వరకు రావాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ను కలిసి ప్రజా సమస్యలపై వినతిపత్రాలు అందజేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

**మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి, జూన్ 22(నమస్తే ఉదయం)**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి (మేడ్చల్), మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్ రెడ్డి,కేపీ వివేకానంద, బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు లు కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పలు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా అర్హులైన నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పారదర్శకంగా కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద కూడా అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన పలు కీలక సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా: జి.ఓ. ఎం.ఎస్. నెం.166 ప్రకారం సర్వే నెం.278లో ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి తిరస్కరించబడిన దరఖాస్తులపై పునఃపరిశీలన చేపట్టాలి. మల్కాజిగిరి నియోజకవర్గంలోని భూదాన్ భూముల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలి.రాజీవ్ రహదారి విస్తరణలో భాగంగా తొలగించాల్సి వస్తున్న హిందూ దేవాలయాలకు తగిన ప్రదేశంలో పునర్నిర్మాణం చేపట్టాలి. ఆల్వాల్ మీ సేవా కేంద్రం రోడ్డు విస్తరణలో కోల్పోతున్న నేపథ్యంలో ప్రజలకు సౌకర్యవంతమైన ప్రాంతంలో నూతన మీ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు తెలంగాణ తల్లి విగ్రహం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలను ఏర్పాటు చేయాలి.ఇటీవల వెంకటాపురం డివిజన్ టెలికాం కాలనీలో విద్యుత్ షాక్ కారణంగా ప్రాణాలు కోల్పోయిన తండ్రి, కుమార్తె కుటుంబ సభ్యులకు తగిన ఆర్థిక సహాయం అందించాలి. ఈ వినతులపై జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఐఏఎస్ సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లఖ్‌నవూలో ఘోర అగ్నిప్రమాదం- 14 మంది మృతి!

మొదటి పేజీ తరువాయి

చిక్కుకుని కోచింగ్ సెంటర్‌లోని పలువురు సజీవదహనం అయ్యారు. తీవ్ర భయాందోళనకు గురైన విద్యార్థులు ప్రాణభయంతో పరుగులు తీశారు. కొందరు ప్రాణాలను రక్షించుకునేందుకు భవనం పైనుంచి కిందకు దూకే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 14 మంది ప్రాణాలు కోల్పోగా పలువురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఏకంగా 14 ఫైర్ ఇంజిన్లు, ఒక హైడ్రాలిక్ ప్లాట్ ఫారమ్ వాహనంతో మంటలను ఆర్పివేశారు. భవనం లోపల దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఈ క్రమంలో పక్కనే ఉన్న మరో భవనం గోడను పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. ఉత్తర్‌ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి బ్రిజేశ్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కొందరు విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చామని చెప్పారు. రెస్క్యూ సిబ్బంది ప్రతి గదిని, బాత్రూమ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని తెలిపారు.



**ప్రత్యక్ష సాక్షులు ఏం చెబుతున్నారు?**

వాణిజ్య భవనంలో మొదట మూడో అంతస్తులో మంటలు అంటుకున్నాయి. అయితే చూస్తుండగానే అవి ఆఫీస్ మొత్తాన్ని చుట్టుముట్టాయని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో కార్యాలయంలో 20 నుంచి 30 మందికి పైగా ఉండొచ్చని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో అక్కడ ఒక్కసారిగా తొక్కిసలాట, గందరగోళం ఏర్పడింది. భవనంలో పనిచేస్తున్న వారు, ఇతరులు తమ ప్రాణాలను రక్షించుకోవడానికి అటూఇటూ పరుగులు తీశారు. బయటకు రావడానికి ఎలాంటి దారులు కనిపించకపోవడంతో, పక్కనే వేలాడుతున్న ఒక వైర్‌ను పట్టుకొని కిందకు దూకడం ప్రారంభించారు. ఈ క్రమంలో ఒక యువతి సహా ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు.

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి**

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు రూ.2 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియాను ప్రధాని కార్యాలయం ప్రకటించింది. క్షతగాత్రులకు 50వేల రూపాయలు ఇవ్వనున్నట్లు పేర్కొంది. భవనంలో ఎంతమంది చిక్కుకున్నారు? ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఏంటనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# సైబర్ బాధితులకు ఊరట.. లోక్ అదాలత్ ద్వారా రూ. 21.90 కోట్ల రీఫండ్!

**24 పోలీస్ స్టేషన్ల పరిధిలో 2,232 కేసుల్లో కోర్టుల సంచలన ఆదేశాలు**

**సైబరాబాద్ పోలీసుల సమగ్ర దర్యాప్తుకు దక్కిన అద్భుత విజయం: శిఖా గోయల్ అభినందనలు**

**శేరిలింగంపల్లి : జూన్ 22, (నమస్తే ఉదయం)**

ఆన్‌లైన్ కేటుగాళ్ల చేతిలో మోసపోయి, సర్వస్వం కోల్పోయామని ఆవేదన చెందుతున్న సైబర్ బాధితులకు జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఊహించని భారీ ఉపశమనం లభించింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టిన రూ. 21.90 కోట్ల భారీ మొత్తాన్ని తిరిగి బాధితుల ఖాతాల్లో జమ చేయాలని న్యాయ స్థానాలు చారిత్రాత్మక రీఫండ్ ఆదేశాలు జారీ చేశాయి. ఈ నెల 20న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఏకంగా 2,232 కేసులలో బాధితులకు అనుకూలంగా తీర్పులు రావడం సైబరాబాద్ పోలీసుల అంకితభావానికి సమర్థవంతమైన దర్యాప్తునకు నిదర్శనంగా నిలిచింది.

**టాప్ గేర్‌లో 'సైబర్ క్రైమ్' రికవరీ.. స్టేషన్ల వారీగా వివరాలు..**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని 24 పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించి, ఈ రికార్డు స్థాయి రీఫండ్‌ను సాధించారు. అమీన్‌పూర్ పి.ఎస్ రూ. 45.94 లక్షలు,



కూకట్‌పల్లి పి.ఎస్ రూ. 12.55 లక్షలు, ఇతర పోలీస్ స్టేషన్ లనుండి రూ. 78.43 లక్షలు రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు అవసరమైన సాంకేతిక, న్యాయ ప్రక్రియలు పూర్తయిన వెంటనే సంబంధిత బ్యాంకులు ఈ నగదును నేరుగా బాధితుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును తిరిగి రాబట్టడం వెనుక సైబరాబాద్ పోలీసుల పక్కా



హైదరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్..

ప్లానింగ్ ఉంది. దర్యాప్తు అధికారులు వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ నిందితుల బ్యాంక్ ఖాతాల వివరాలు, కేవైసీ డేటాను సేకరించారు. నిధులు ఏయే ఖాతాల్లోకి మళ్లాయో దశలవారీగా 'మనీ ట్రైల్' విశ్లేషించి, నిధులు ఫ్రీజ్ చేయించారు. బలమైన ఆధారాలతో కోర్టులలో రీఫండ్ పిటిషన్లు దాఖలు చేయడం వల్లే ఇంత వేగంగా బాధితులకు సత్వర ఆర్థిక ఉపశమనం దక్కింది. ఈ అసాధారణ విజయం సాధించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్, తోపాటు దర్యాప్తు బృందాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ ప్రత్యేకంగా అభినందించారు. న్యాయవ్యవస్థ, పోలీస్ శాఖ, బ్యాంకింగ్ రంగాల సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఆమె కొనియాడారు.

# ఈనెల 24న 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ జెండా ఆవిష్కరణ

**విజయవంతం చేయాలని ధరూర్ మండల నాయకుల పిలుపు**



**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 22(నమస్తే ఉదయం):**

బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, సామాజిక తెలంగాణే లక్ష్యంగా ఏర్పడిన 'తెలంగాణ రక్షణ సేన' (టిఆర్ఎస్) పార్టీ నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 24న (బుధవారం) ధరూర్ మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు పార్టీ మండల నాయకులు మల్దకల్ అడవి ఆంజనేయులు, వెంకటేష్, మునెప్ప, రాము తదితరులు సోమవారం ధరూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో సామాజిక న్యాయమే ధ్యేయంగా, ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే గొంతుకగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తమ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వారు కోరారు. ఈనెల 24న బుధవారం ధరూర్ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ చౌరస్తా నందు నిర్వహించే ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి మండల పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు






# ప్రైవేట్ వదిలి సర్కారు బడికి: తెలుగోనిపల్లి గ్రామస్తుల ఆదర్శం!

**ఒకే రోజు ప్రభుత్వ పాఠశాలలో చేరిన 23 మంది విద్యార్థులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 22 (నమస్తే ఉదయం):**

జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం తెలుగోనిపల్లి గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల మోజు వీడి, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడి వైపు మళ్లించి ఆదర్శంగా నిలిచారు. సోమవారం 'బడి బాట' కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ దాసరి బిసన్న సమక్షంలో ఒకేరోజు 23 మంది విద్యార్థులు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేరారు. ఇందులో ప్రైమరీ స్కూల్లో 14 మంది, ప్రీ–ప్రైమరీ అంగన్‌వాడీలో 9 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. ప్రవీణ, ఉపాధ్యాయులు మరిడి శ్రీకాంత్, వెంకటేశ్వర గౌడ్ గార్లు సర్పంచ్ సహకారంతో గ్రామంలో ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ప్రభుత్వ బడిలో ఉచిత సౌకర్యాలతో పాటు ఆంగ్ల మాధ్యమం బోధనపై తల్లిదండ్రులను మోటివేట్ చేసి ఈ చేరికలు సాధించారు. తమపై నమ్మకంతో పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలుపుతూ, చక్కటి బోధన అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమంలో 21 ఫిర్యాదులు స్వీకరణ

**జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 22(నమస్తే ఉదయం):**

ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుండి విన్నపాలు వెల్లువెత్తాయి. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు. ఈ ప్రజావాణిలో 21 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ



సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం వల్ల వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుల్లో కళ్యమ్ (దొడ్డి) కి నిప్పుపెట్టడం – 01, ప్లాట్ల ఆక్రమణకు సంబంధించినది – 01, గొడవలకు సంబంధించినవి – 02, భూ వివాదాలకు సంబంధించినవి – 15, ఇతర అంశాలకు సంబంధించినవి – 02 ఫిర్యాదులు అందాయి.

# డబ్బులు లేక ఏ ఒక్కరూ చికిత్సకు దూరం కావద్దు

**25 ఏళ్ల క్రితం ఓ సదాశయంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించాం**

**రజతోత్సవ వేడుకల్లో బసవతారకం చైర్మన్ బాలకృష్ణ.. చంద్రబాబు, వెంకయ్య, ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల హాజరు**









**హైదరాబాద్, జూన్ 22(నమస్తే ఉదయం)**

పేదలకు అండగా ఉండాలనే లక్ష్యంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైందని ఆసుపత్రి చైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోజుకి 35 నుంచి 40 శస్త్ర చికిత్సలు చేస్తున్నామని.. వేలాది మందికి ఇది ఓ ఆశాకిరణమని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. నటుడిగా, ఎమ్మెల్యేగా కాదు.. ఓ కొడుకుగా మీ ముందు నిలుచున్నా. మా అమ్మ బసవతారకం క్యాన్సర్ బారిన పడిన పరిడు ఎంతో బాధపడ్డాం. డబ్బు ఉంది కాబట్టి గట్టిగా పోరాడగలిగాం. డబ్బు లేని వారు ఈవ్యాధితో ఎలా పోరాడుతారని మా అమ్మ ప్రశ్నించారు. అపరిడే ఈ ట్రస్ట్ ఏర్పాటు ఆలోచన వచ్చింది. 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించాం. బాధతో ఆసుపత్రికి వచ్చే వారు నవ్వుతూ తిరిగి వెళ్లాలి అనేదే మా ఉద్దేశం. భారత్‌లోనే మొట్టమొదటి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రం అప్పట్లో ప్రారంభించాం.ప్రభుత్వాలు మాకు ఎంతగానో సహకరించాయి. ఎన్నో సంస్థలు, ఎందరో దాతలు ఈ ప్రయాణంలో మాకు అండగా నిలిచారు. ఏ ఒక్క రోగి కూడా డబ్బు లేక క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదు. 25 ఏళ్ల క్రితం చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకున్నాం.. భవిష్యత్తులోనూ కొనసాగిస్తాం. అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తాం. హైదరాబాద్‌లో సేవలు మరింత విస్తరిస్తాం అని బాలకృష్ణ అన్నారు. హైదరాబాద్ నోవాటెల్ హోటల్‌లో బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు– పురందేశ్వరి దంపతులు, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ, సినీనటి గౌతమి తదితరులు పాల్గొన్నారు. రజతోత్సవ వేడుకల సందర్భంగా ఆస్పత్రి ప్రస్థానం, వైద్య సేవలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. క్యాన్సర్ చికిత్స రంగంలో ఆస్పత్రి అందిస్తున్న సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయని అతిథులు అభినందించారు.

# హైదరాబాద్ నగరంలోని రోడ్డుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు వద్దు

**రాజేంద్రనగర్, జూన్ 22**

తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ నగరంలో అమెరికా కాన్సులేట్ కార్యాలయం రోడ్డు కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు పెట్టాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్రెడ్డి చేసిన ప్రతిపాధన ను వెంటనే ఉప సంహరించుకోవాలని సీఐటీయు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చం ద్రమోహన్ డిమాండ్ చేశారు. సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ చౌంరనస్థా లో ఏరియా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. సీఐటీయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జె రుద్ర కుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సం దర్భంగా ఎం చంద్రమోహన్, జె రుద్రకుమార్ లు మాట్లాడుతూ, రక్త పిశాచి, యుద్ధోన్మాదిగా ఉన్న ట్రంప్ వెనిజులా అధ్యక్షుణ్ణి బందించి నిర్బందించి ఆ దేశాన్ని అంధకారంలో నెట్టి వేసి ఆ దేశంలో ఉన్నటువం టి చమురు మౌళిక వసతులన్ని దోచుకుంటున్న మోది పేరు హైదరాబాద్ లోని రోడ్డు కు పెట్టడం ఏం టని ప్రశ్నించారు. రోజుకు ఒక దేశం పైన యుద్ధాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. పసిపిల్లలను చూడకుండ చంపుతున్నారని దుయ్య బట్టారు.



కాటేదాన్ లో నిరసన తెలుపుతున్న సీ ఐ టీ యూ నాయకులు

నిరసన ర్యాలీ లో సీఐటీయు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి అలేటి ఎల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు పీసీకే భాస్కర్, బి. వెంకటయ్య, సాయి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## టెలిఫోన్ కాలనీ సమస్యలను పరిష్కరించాలంటు ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు ఉస్కేమూరి విజయ్ కుమార్

**బుద్వేల్ , జూన్ 22 (నమస్తే ఉదయం) :**

అత్తాపూర్ సర్కిల్ లక్ష్మీగూడ సమీపంలోని నిత్య కాలనీ,వాంబేకాలనీ, రాజీవ్ గృహకల్ప, వాసవీ కాలనీల డ్రైనేజీ నీరు టెలిఫోన్ కాలనీ కి వచ్చి చేరుతుందని, ఆ కాలనీ లో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు ఉస్కెమూరి విజయ్ కుమార్ కోరారు. ఇదే విషయమై సోమవారం అత్తాపూర్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన ప్రజా వాణి కార్యక్రమ లో ఆయన లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ సమస్య వర్షా కాలంలో మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. చెరువులా మురుగునీరు చేరడం వల్ల దుర్గంధం వెదజల్లుతుందని, దోమలు వృద్ధి చెం ది అంటు రోగాలు ప్రభలడానికి కారణమౌతుందని ఫిర్యాదు లో పేర్కొన్నారు. ఈ సమస్య పై స్థానిక ప్రజలు ఎన్ని సార్లు ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్న పట్టించుకోలేదన్నారు. పేద ప్రజలు నివసించే బస్తీలలో డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడం లేదని, వీధి దీపాలు ఏర్పాటు చేయడం లేదని, పారిశుధ్య నిర్వాహణ పనులు చేయడం లేదని గుర్తు చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న కాలనీ లలో అభివృద్ధి పనులు చేయడం లేదని, కొత్త గా ఏర్పాటైన కాలనీలలో మాత్రం రోడ్లు వేసి, డ్రైనేజీ కాలువలు నిర్మిసు బిన్నారని ఉ స్కెమూరి విజయ్ కుమార్ వాపోయారు. జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి లక్ష్మీగూడ టెలిఫోన్ కాలనీలో ఉన్న డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో అభివృద్ధి పనులు ఎక్కడ జరుగుతున్నాయో.. సమాచార హక్కు చట్టం ద్వారా వివరాలు సేకరించి అధికారుల తీరు ను ఎండగడుతామని హెచ్చరించారు.

## బుద్వేల్ టీచర్స్ కాలనీలో వెలుగని వీధి దీపాలను బాగు చేయాలి

**నందిగామ నరసింహ**

**బుద్వేల్, జూన్ 22 (నమస్తే ఉదయం) :**

బుద్వేల్ టీచర్స్ కాలనీలో గత వారం రోజులుగా వీధి దీపాలు వెలుగడం లేదని ఆ కాలనీ అధ్యక్షులు నందిగామ నర్సింమ్మ అన్నారు. ఇదే విషయమై సోమవారం ఉ దయం రాజేం ద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి కి వినతి పత్రం అందజేశారు. హెబ్రోను చర్చి నుంచి కట్ట మైసమ్మ దేవాలయం వరకు వీధి దీపాలు వెలుగడం లేదన్నారు. వర్షాకాలం కావడంతో పక్కనే ఉన్న వ్యవసాయ విశ్వవిద్యాలయం భూముల నుంచి విష సర్పాలు వస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైన అధికారులు స్పందించి టీచర్స్ కాలనీ ఎఓ వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు.



రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి కి వినతి పత్రం అందచేస్తున్న బుద్వేల్ టీచర్స్ కాలనీ అధ్యక్షుడు నందిగామ నరసింహ



## నేడు శివరాంపల్లిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రాజేంద్రనగర్, జూన్ 22 (నమస్తే ఉదయం)**

: శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల కారణంగా రాజేంద్రనగర్, జూన్ 22 విద్యుత్ సరఫరాలో మంగళవారం అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ ఓ ప్రకటన లో తెలిపారు. సెక్షన్ పరిధిలోని బవానీ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 గంటల నుంచి మద్యాహ్నాం 12 గంటల వరకు బవానీ కాలనీ, ఇంద్రారెడ్డినగర్ పార్కు, ప్రేమావతిపేట్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందన్నారు.

**శ్రీదేవి హౌసింగ్ విద్యుత్ పీడర్ పరిధిలో..**

మద్యాహ్నాం రెండున్నర గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీదేవీ కాలనీ, ఖాద్రీ హిల్స్ విశ్వవిద్యాలయం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యానికి సహకరించాలన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండే ప్రాంతాలు

## గగన్ పాడ్, శివరాంపల్లి, కిస్మత్పూర్, హిమాయత్ సాగర్, శంషాబాద్, షాపూర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేత

**రాజేంద్రనగర్, జూన్ 22(నమస్తే ఉదయం)**

శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరా లో మంగళవారం అంతరాయం ఉ ంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ నవీన్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని భవానీ కాలనీ విద్యుత్ పీటర్ పరిధిలో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు భవాని కాలనీ ఇందిరా రెడ్డి పార్క్ ప్రేమావతి పేట్, శ్రీదేవి హౌసింగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 5 గంటల వరకు శ్రీదేవి కాలనీ ఖాద్రి హిల్స్ విశ్వవిద్యాలయం పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు

**గగన్ పహాడ్ లో...**

గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉ ంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హర్షవర్ధన్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడానికి ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జల్పల్లి, శ్రీరామ్ కాలనీ, పారిశ్రామిక ప్రాంతం, శివాజీ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు శివాజీ నగర్, పారిశ్రామికవాడ, లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**హిమాయత్ సాగర్...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు స్నేహిత హిల్స్ ఫేస్-1, రాయల్ ఓక్ ఫర్నిచర్, ఇండియన్ పబ్లిక్ స్కూల్, అక్బర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ 60 యార్డ్స ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్ తెలిపారు.

**కిస్మత్పూర్ లో...**

కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు. సెక్షన్ పరిధిలోని ఎల్బీ ప్రసాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం 12:30 వరకు కే టి టి కాలనీ, శ్రీ బాలాజీ ఎంక్లేవ్, రాజా క్షేత్ర, గిరిదారి, గిరిదారి విస్తా, ఎల్వీ ప్రసాద్, దర్గా కలుస్తాం, కీర్తి విల్లాస్, నమః, మ్యాప్ ఫర్ కన్స్ట్రక్షన్, 80 యార్డ్స్, 60 యార్డ్స్, మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పి అండ్ టి కాలనీ ఫీడర్



పరిధిలో గల ప్రాంతాలైన ఆదర్శనగర్, బైరాగి గూడ, భవాని కాలనీ, బండ్లగూడ విలేజ్, చేవెళ్ల, చింతల్ మెట్ టవర్స్, సిటీ మీటర్స్ , హిమాయత్ సాగర్, గంధం గూడ, హిమగిరి కాలనీ, హెచ్ వి బండ్లగూడ, హెచ్ బి నెట్ మీటర్స్, హెచ్ వి పి అండ్ టి సన్ సిటీ, హైదర్ షాకోట్, జే ఎల్ ఎన్ ఎస్ కాలనీ, కాళికా నగర్, కపిల్ నగర్, పి అండ్ టీ కాలనీ, పి అండ్ టి కాలనీ సి బ్లాక్, వీరం చెరువు, రాధానగర్, ఆర్ జి జి వై గృహ, సాయి హర్ష కాలనీ, సాయిరాం నగర్ కాలనీ, ఎస్ ఎం ఆర్ బిల్డర్స్, శ్రీనివాస నగర్ కాలనీ, ఎస్ టి ఎల్, పిడబ్ల్యూఎస్ గంధం గూడ, సన్ సిటీ, విద్యాపీఠం ప్రాంతాలలో మిద్దె సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

**శంషాబాద్ లో...**

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమత్త నిమిత్తం ఓల్డ్ పిఎస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండున్నర నుండి సాయంత్రం 5:30 వరకు ఓల్డ్ పి ఎస్, ఏకే టౌన్షిప్, బాల యేసు కాలని, ఏమని టౌన్షిప్, వెల్లంకి నగర్, హమ్మద్ నగర్, మార్త, అక్బర్ కాలనీ, బృందావన్ కాలనీ, సిద్ధప్ప రోడ్డు, పోచమ్మ గడ్డ, సంజయ్ వాడ, మధ్యాహ్నం బెల్లంకి నగర్, వివేకానంద నగర్, చారి నగర్, శాతం రాయి, జెండా ఎక్స్ రోడ్, రైల్వే స్టేషన్, సాయిరాజ్ గార్డెన్, మేది గార్డెన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు శంషాబాద్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు.

**షాపూర్ లో..**

షాపూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాచారం ఫీడర్, వర్ధమాన్ కాలేజ్ లీడర్ పరిధిలో గల ప్రాంతాలైన కాచారం గ్రామం, వర్ధమాన్ కాలేజ్ ప్రాంతం, వర్ధమాన్ కాలేజ్ హాస్టల్, మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నానాజీ పూర్ ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలైన నానాజీపూర్ గ్రామం, రాగన్నగూడ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు విద్యుత్తు వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



కేటీఆర్ సమక్షంలో బీ ఆర్ ఎస్ లో చేరిన పిట్టల శివ ముదిరాజ్

## స్వంత పార్టీలో చేరిన పిట్టల శివ ముదిరాజ్

**బుద్వేల్, జూన్ 22 (నమస్తే ఉదయం)**

తెలంగాణ ఉద్యమ కారుడు, రెండు పర్యాయాలు శివరాంపల్లి, రాజేం ద్రనగర్ డివిజన్లకు బీఆర్ఎస్ అధ్యక్షునిగా పనిచేసి అనివార్య కారణాల వల్ల కాంగ్రెస్ పార్టీ లో చేరిన శివరాంపల్లి కి చెందిన పిట్టల శివ ముదిరాజ్ తిరిగి బీఆర్ఎస్ లో చేరారు. ఆదివారం సాయంత్రం ఆయన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇం ద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి ల సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఆయన తో పాటు ఆయాజ్ షరీఫ్, సతీష్. వారి అనుచరులు బీఆర్ఎ ఎస్ లో చేరగా కేటీఆర్ వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా పిట్టల శివ ముదిరాజ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ బలోపేతానికి తన శక్తి వంచన లేకుండ కృషి చేస్తాననన్నారు.



చిన్నారుల చేత అక్షరా బ్యాసం చేయిస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్

## మార్కండేయనగర్‌లో అమ్మ మాట.... అంగన్వాడీ బాట కార్యక్రమం

**బుద్వేల్, జూన్ 22 (నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం మార్కండేయనగర్ -1, వడ్డెర బస్తీ అం గన్వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అక్షరాభాస్యం కార్యక్రమం నిర్వహించారు. అమ్మ మాట -అంగన్వాడీ బాట అనే నినాధంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎస్ వెంకటేశ్ పాల్గొని చిన్నారుల చేత అక్షరా భాస్యం చేయించారు. చిన్ననాటి నుం చే చిన్నారులను తీర్చిదిద్దడానికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు పద్మజ, రూప, టీచర్లు జె సంగీత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

**బుద్వేల్, జూన్ 22 (నమస్తే ఉదయం) :**

రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డైరీ ఫార్మ్ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, మూడు రోజుల క్రితం రాంగ్ రూట్‌లో వచ్చిన కారు డ్రైవర్ ఆర్టీసీ బస్సును అడ్డగించి, అనంతరం బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రాజేంద్రనగర్ పోలీసులు, నిందితులైన మహనీత్ రెడ్డి, సూర్యలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించారు.విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసినందుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్, వాహనాల తనిఖీలు

**బుద్వేల్, జూన్ 22 (నమస్తే ఉదయం) :**

రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగిం ది. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనా లపై ముగ్గురు చొప్పున ప్రయాణిస్తున్న 27 వాహనాలను గుర్తించి చలాన్లు వే య డం జరిగిందన్నారు. అధిక సంఖ్యలో ఆటోలలో ప్రయాణికులను తీసుకువెళ్తున్నట్లు గుర్తిం చి 17 ఆటోల పై చలాన్లు విదించామన్నారు. వాటి లో పాఠశాలల చిన్నారులు వెళుతున్న ఆటోలు ఎక్కువగా ఉన్నాయని ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి వినియోగదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లఘించ కూడదన్నారు.



హిమాయత్ సాగర్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడుతున్న ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ సీ హెచ్ రాజు



ట్రాఫిక్ పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్



## కేజీబీవీలలో అర్హులైన బాలికలకు వెంటనే సీట్లు కేటాయించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 22(నమస్తే ఉదయం):**

కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లోప్రవేశాల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన బాలికలకు వెంటనే సీట్లు కేటాయించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం గద్వాలలో ప్రాంతీయ సమన్వయ అధికారి నీ టిఎన్ఎస్ఎఫ్, పీడీఎస్ యు, యుఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల పేద, అనాథ, ఒంటరి తల్లిదండ్రుల పిల్లలకు మరియు వెనుకబడిన వర్గాల విద్యార్థినులకు ప్రవేశాల్లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సీట్ల కేటాయింపులో ఎలాంటి రాజకీయ జోక్యం, అవకతవకలు జరగకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ఖాళీ సీట్లను భర్తీ చేయాలని, పేద బాలికలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పేరు సుభాన్, పీడీఎస్ యు జిల్లా అధ్యక్షుడు హాలింపాషా, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి వామన్‌పల్లి రంగస్వామి, చంద్ పాషా, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.




## హైదర్‌గూడలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ..

### బీజేపీ సీనియర్ నాయకులు మోంద్ర కొమురయ్య

**రాజేంద్రనగర్,జూన్23 (నమస్తే ఉదయం)**

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తు ముందుకు సాగాలని బీజేపీ సీనియర్ నాయకులు మోంద్ర కొమురయ్య అన్నారు.అత్తాపూర్ సర్కిల్ హైదర్‌గూడలో సోమవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆర్‌పీ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకులు మోంద్ర కొమురయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మహిళల సంక్షేమం కోసం అమలు అవుతున్న పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఇందిరమ్మ చీరల పంపిణీ ద్వారా మహిళలకు ఆర్థిక భారం కొంత తగ్గుతుందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు,స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.



## సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

### భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
### పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు

**ఇస్లామాబాద్,జూన్22 (నమస్తే ఉదయం)**

సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాకకు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

## ఓట్ల చోరీకి బీజేపీ కుట్ర.. కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి

### ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి... బీఎల్ఏల అవగాహన శిక్షణ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే పిలుపు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 22(నమస్తే ఉదయం):**

ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియ పేరుతో ప్రజల ఓటు హక్కును దెబ్బతీసి, ఓట్లను చోరీ చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని, కాంగ్రెస్ శ్రేణులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) పై పోలింగ్ బూత్ లెవెల్ ఏజెంట్ల (BLA) అవగాహన శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజ్యాంగ విరుద్ధమైన విధానాలతో ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే కుట్రలను కాంగ్రెస్ పార్టీ గట్టిగా ఎదుర్కొంటుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం, తప్పులను సరిదిద్దడంలో బీఎల్ఏలదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. ప్రతిరోజు బీఎల్ఓ (BLO)ల వెంట ఉంటూ ఇంటింటి పరిశీలన చేయాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, గద్వాల





మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడ, నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, వెంకటేష్, డీసీసీ ఉపాధ్యక్షురాలు రామేశ్వరమ్మ, కురుమన్నలతో పాటు కౌన్సిలర్లు, సర్పంచులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, కాంగ్రెస్ కార్యకర్తలు మరియు బీఎల్ఏ (BLA) ఏజెంట్లు పాల్గొన్నారు.

## విద్యార్థులను తల్లిదండ్రులు బాగా చదివించాలి

**ప్రముఖ విద్యాప్రదాత శేషంపల్లి నరసింహులు**

**విద్యతోనే సమాజాభివృద్ధి .. మల్దకల్ మండల పదవ తరగతి టాపర్లకు ఘన సన్మానం**

**మల్దకల్, జూన్ 22(నమస్తే ఉదయం)**

పదవ తరగతి ఫలితాలలో మల్దకల్ మండల స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన టాపర్లకు పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఘన సన్మానం నిర్వహించారు. ప్రముఖ విద్యాప్రదాత శేషంపల్లి నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎస్ఐ శ్రీహరి, ఎంఈఓ సురేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. గత పదేళ్లుగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్న శేషంపల్లి నరసింహులు, ఈ ఏడాది తెలుగు, ఇంగ్లీష్ మీడియం టాపర్లకు విడివిడిగా ప్రథమ (రూ. 10,000), ద్వితీయ (రూ. 8,000), తృతీయ (రూ. 5,000)





బహుమతులను తన సొంత నిధులతో అందించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మరియు ఎంఈఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. సొంత ఖర్చులతో విద్యార్థులను ప్రోత్సహిస్తున్న నరసింహులు సేవలను వారు కొనియాడారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు

## దేవాదాయ భూములు కబ్జా అవుతున్నా పట్టించుకోవడంలో నిర్లక్ష్యం..

### కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి

**శంషాబాద్,జూన్22(నమస్తే ఉదయం)**

దేవాదాయ భూములు కబ్జా అవుతున్నా పట్టించుకోవడం లేదని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్,భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్ మున్సిపాలిటీ 119వ డివిజన్ పరిధిలోని కొత్వాల్ గూడ గ్రామంలోని సర్వే నెంబర్ 128 లో ఉన్న ఒక్క ఎకరా 16 గుంటల దేవాలయ భూమి కబ్జాకు గురైందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకుని రావడంతో వెంటనే కొత్వాల్ గూడ గ్రామానికి చేరుకొని దేవాలయ ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామస్తులంతా ఒక్కతాటిపై ఉండి ఈ భూమిని కాపాడుకోవడానికి అందరూ కలిసి రావడం చాలా సంతోషంగా ఉందని,ఈ భూమిని గతంలో శ్రీ కట్ట మైసమ్మ దేవాలయానికి దానం చేసినట్లు వారు తెలిపారు.దేవాలయానికి చెందిన ఈ భూమిపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని,వెంటనే రెవెన్యూ,దేవాదాయ శాఖ అధికారులు విచారణ చేపట్టి





భూమిని పరిరక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భూమికి సంబంధించిన పాత రికార్డులు దాన పత్రాలను పరిశీలించి న్యాయం చేయాలని తెలియజేశారు.ఈ విధంగా దేవల భూములను కూడా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే భారతీయ భారతీయ జనతా పార్టీ ఊరుకునేదే లేదన్నారు.ఈ ప్రభుత్వ భూమిని కాపాడుకోవడానికి అన్ని విధాలుగా తమ న్యాపరమైన పోరాటం కొనసాగుతుందని గ్రామ ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం చేయడానికి భారతీయ జనతా పార్టీ తరఫున కృషి చేస్తామని తెలియజేస్తూ భరోసాను కల్పించారు.ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్,మాజీ సర్పంచ్ లింగం యాదవ్,దేవాలయ కమిటీ సభ్యులు,శంషాబాద్ మున్సిపాలిటీలోని ముఖ్య నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళల అభివృద్ధే ధ్యేయంగాప్రభుత్వం పనిచేస్తుంది: ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

### ప్రభుత్వం చేపడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి





స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశి సదాలక్ష్మి లు... సమావేశంలో పాల్గొన్న మహిళా సంఘాల సభ్యులు

**బుద్వేల్ , జూన్ 22 ( నమస్తే ఉదయం)**

మహిళల ఆర్థిక, సామాజిక ఉన్నతే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాజేం ద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో ఉన్న మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులకు సోమవారం పీడీపీ చౌరస్తా సమీపంలో ఉన్న రాయల్ హయాత్ ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశి సదాలక్ష్మీ తో కలసి ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, మహిళల ప్రగతి కి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అర్హులైన ప్రతి మహిళకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు అబ్దేశి సదాలక్షి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత రవాణ సౌకర్యాన్ని ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు, ఇందిరమ్మ క్యాంటిన్ లాంటి పథకాలు ప్రవేశ పెట్టి ప్రోత్సహిస్తున్నారని, ఇవన్ని మహిళా సంక్షేమాన్ని గుర్తు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సురేం దర్ రెడ్డి, డిప్యూటీ ప్రాజెక్టు ఆఫీసర్లు డాక్టర్ స్వాతి, యుగంధర్ రెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు లక్ష్మణ్, విజయ్, విజయేందర్, ఉపేందర్, రేణుక, రిసోర్స్ పర్సన్లు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఖతార్ గ్యాస్ క్షేత్రంలో భారీ పేలుడు

### 54మందికి తీవ్ర గాయాలు.. 18 మంది ఆచూకీ గల్లంతు

**ఖతార్,జూన్22 (నమస్తే ఉదయం):**

ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18మంది జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రాణనష్టంపై వివరాలు అందాల్సి ఉంది. వాస్తవానికి ఇరాన్-అమెరికా యుద్ధం వేళ ఐఆర్‌జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి



సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40-47శాతం వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్-ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్ఎన్‌జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699. Cell: 9492148733